సాక్షి
పశ్చిమగోదావరి
మంగళవారం । 27 । ఆగస్టు । 2024



బందరు లైన్‌కు గ్రీన్‌సిగ్నల్

బ్రిటీష్ హయాం నుంచి పెండింగ్‌లో ఉన్న నరసాపురం – మచిలీపట్నం (బందరు) మధ్య కొత్త రైల్వే లైన్ నిర్మాణం చేపట్టాలని రైల్వే శాఖ ఎట్టకేలకు నిర్ణయించింది. 8లో ▸



ఇంక్యుబేషన్‌తో ఉపాధి

వైఎస్సార్ ఉద్యాన యూనివర్సిటీ గ్రామీణ యువత, మహిళలు ఉద్యాన రంగంలో ఉపాధి కల్పించేలా పరిశ్రమల ఏర్పాటుపై వారికి శిక్షణ ఇచ్చి ప్రోత్సహిస్తోంది. 8లో ▸



ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ ముఠా అరెస్టు

పొలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో రాగి వైరు చోరీ చేస్తున్న ఐదుగురు సభ్యుల ముఠాను అరెస్టు చేసినట్లు ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్ చెప్పారు. 8లో ▸



కఠిన చట్టాలు తీసుకురావాలి



వైద్యులపై జరుగుతున్న దాడుల్ని అరికట్టేందుకు జాతీయ స్థాయిలో కఠిన చట్టాలు తీసుకురావాలి. ప్రత్యేక లా, టాస్క్‌ఫోర్సు ఏర్పాటు చేయాలి. నిందితులకు తక్షణమే శిక్షలు పడేలా చూడాలి. ఎప్పటినుంచో వైద్యులపై దౌర్జన్యాలు జరుగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా మహిళా వైద్యులకు భద్రత లేదు. అదీ రాత్రి వేళల్లో పనిచేసే మహిళా వైద్యులకు భద్రతను పెంచాలి. తల్లిదండ్రులు కూడా మహిళల రక్షణపై పిల్లలకూ తగిన శిక్షణ ఇవ్వాలి.

– స్వర్ణ నిరంజని, వైద్యురాలు, పాలకోడేరు పీహెచ్‌సీ

మహిళా వైద్యులకు భద్రత పెంచాలి



వైద్యులకు, వైద్య సిబ్బందికి నూరుశాతం రక్షణ కల్పించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. కోల్‌కతాలో మెడికల్ కాలేజీ వైద్యురాలిపై హత్యాచారం దుర్మార్గపు చర్య. ఇలాంటి దుశ్చర్యలకు అడ్డుకట్టు వేయాలంటే దేశవ్యాప్తంగా ప్రత్యేక చట్టాలు తీసుకురావాలి. మహిళా వైద్యులకు భద్రత కల్పించే విషయమై ప్రభుత్వాలు శ్రద్ధ తీసుకోవాలి. ఇటువంటి ఘటనల్లో నిందితులను కఠినంగా శిక్షించాలి. స్త్రీలను గౌరవించే సంస్కృతి అందరిలోనూ రావాలి.

– నరాబు సునీల్, కాళ్ల ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు

సమస్యల సాగు



ఖరీఫ్ ప్రారంభం నుంచి రైతులకు కష్టాలు తప్పడం లేదు. మొన్నటివరకు భారీ వర్షాలు పంటకు నష్టం కలిగిస్తే ఇప్పుడు ప్రతికూల వాతావరణంతో తెగుళ్లు విజృంభిస్తున్నాయి. నివారణ చర్యలతో రైతులకు పెట్టుబడులు తడిసిమోపెడవుతున్నాయి. ఎకరాకు రూ.20 వేలు సాయం అందిస్తామన్న కూటమి ఎన్నికల హామీ ఆచరణకు నోచుకోక రైతులు అవస్థలు పడాల్సి వస్తోంది.

- భారీ వర్షాలతో ఖరీఫ్ ప్రారంభంలోనే నష్టపోయిన రైతులు
- ప్రతికూల వాతావరణంతో వరి పంటపై తెగుళ్లతో కుదేలు
- తడిసి మోపెడవుతున్న పెట్టుబడులతో భారంగా సాగు
- రైతన్నకు ఏటా రూ.20 వేలు ఇస్తామని కూటమి హామీ
- తొలకరి మొదలై రెండు నెలలైనా ఆ ఊసే ఎత్తని ప్రభుత్వం
- అన్నదాత సుఖీభవ, ఇన్‌పుట్ సాయం కోసం ఎదురుచూపు
- గత ప్రభుత్వంలో ఖరీఫ్ ప్రారంభంలోనే రైతు భరోసా సాయం
- పంట నష్టం వాటిల్లితే సకాలంలో ఇన్‌పుట్ సబ్సిడీ అందజేత

జిల్లాలో ఖరీఫ్ వరి సాగు	2.30 లక్షల ఎకరాలు
భారీ వర్షాలకు దెబ్బతిన్న పంట	13,242 ఎకరాలు
రైతులకు వాటిల్లిన నష్టం	రూ.9.54 కోట్లు
నష్టపోయిన రైతుల సంఖ్య	9,918

సాక్షి, భీమవరం: జిల్లాలోని 2.30 లక్షల ఎకరాల్లో రైతులు తొలకరి సాగు చేస్తున్నారు. గత నెలలో కురిసిన భారీ వర్షాల వల్ల సాగు ఆరంభంలోనే పంటకు నష్టం వాటిల్లింది. ముంపు ప్రభావంతో 9,918 మంది రైతులకు చెందిన 14 వేల ఎకరాల్లో రూ. 9.54 కోట్లు పంట నష్టం వాటిల్లింది. ముందుగా నాట్లు పూర్తయిన పెంటపాడు, తాడేపల్లిగూడెం, తణుకు రూరల్, ఉండ్రాజవరం తదితర మండలాల్లో నష్టం ఎక్కువగా ఉంది. నారుమడి నుంచి నాట్లు వేసే వరకు ఎకరాకు రూ.10 వేలు వరకు పెట్టుబడులు కాగా పంట నష్టం వాటిల్లిన పొలాల్లో తిరిగి నాట్లు వేసేందుకు అదనంగా ఎకరాకు రూ.ఐదు వేలు వరకు ఖర్చయినట్టు రైతులు చెబుతున్నారు. ఇప్పటికే పంట నష్టపోయిన రైతుల వివరాలను అధికార యంత్రాంగం ప్రభుత్వానికి నివేదించింది. నష్టపరిహారం అందితే కొంత ఊరట లభిస్తుందనుకుంటే ఎప్పుడు వస్తుందో ప్రభుత్వం నుంచి స్పష్టత లేదని వారంటున్నారు.

రెండు నెలలైనా రూ.20 వేల ఊసే లేదు

రైతన్నకు ఏడాదికి రూ.20 వేలు చొప్పున ఆర్థికసాయం అందిస్తామని కూటమి హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చాక వైఎస్సార్ రైతు భరోసా పేరును అన్నదాత సుఖీభవగా మార్చింది. తొలకరి సాగు మొదలై రెండు నెలలు కాగా ఎన్నికల హామీపై ఇప్పటికి కూటమి ప్రభుత్వం నోరు మెదపడం లేదు. పీఎం కిసాన్ తొలి విడతగా జూన్‌లో కేంద్రం రూ.2వేల చొప్పున రైతుల ఖాతాలకు జమచేయగా అన్నదాత సుఖీభవ సాయం విడుదలపై రాష్ట్ర ప్రభుత్వం నోరుమెదకపోవడంతో దళారులను ఆశ్రయిస్తున్నారు.



అత్తిలిలోని ఓ పొలంలో తెగుళ్ల నివారణ మందు పిచికారీ చేస్తున్న కూలీలు

తెగుళ్లతో కలవరం

ప్రతికూల వాతావరణ పరిస్థితులతో పంటపై తెగుళ్లు విజృంభిస్తున్నాయి. ప్రస్తుతం ఖరీఫ్ పిలకలు వేసే దశ నుంచి చిరుపొట్ట దశల్లో ఉంది. పలుచోట్ల మాగుడు, కాండంతొలుచు, నల్లి తదితర తెగుళ్లు పంటను ఆశిస్తుండటం రైతులను కలవరపరుస్తోంది. మాగుడు తెగులుతో ఆకులపై మచ్చలు ఏర్పడి వరి దుబ్బులు ఎండిపోతుండగా, కాండం తొలుచు పురుగు ప్రభావంతో దుబ్బు వెన్ను విరిగి నష్టం వాటిల్లుతోంది. ఎర్ర నల్లి పురుగు ఆకులపై పత్రహరితం తినేస్తుండటంతో ఆకులపై మచ్చలు ఏర్పడి రంగుమారిపోతున్నాయి. తెగుళ్లను అరికట్టేందుకు మందుల పిచికారి కోసం ఎకరాకు రూ.రెండు వేలు వరకు ఖర్చవుతోందని రైతులు చెబుతున్నారు.

రెండుసార్లు నాట్లు వేశాం



ఆరు ఎకరాల్లో వరి సాగు చేస్తున్నాను. నాట్లు వేసిన కొద్దిరోజులకే భారీ వర్షాలు దెబ్బతీశాయి. పొలాల్లో నీరు లాగక నాట్లు మొత్తం కుళ్లిపోవడంతో రెండోసారి నాట్లు వేయాల్సి వచ్చింది. మొదటిసారి నాట్లుకు రూ.10 వేలు ఖర్చయితే రెండోసారి రూ.5 వేలు ఖర్చు చేశాను. ఇన్‌పుట్ సబ్సిడీ ఇంకా అందలేదు.

– బోడపాటి ఏసు, రైతు, ముదునూరు, పెంటపాడు మండలం

హామీని అమలుచేయాలి



అధికారంలోకి వస్తే ఏటా రైతులకు రూ.20 వేల చొప్పున సాయం అందిస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారు. తొలకరి పనులు మొదలై రెండు నెలలైంది. పంట పెట్టుబడులు కోసం ఇబ్బంది పడాల్సి వస్తోంది. పెట్టుబడి సాయం ఇస్తే రైతులకు అప్పులు చేయాల్సిన అవసరం లేకుండా ఎంతో ఆసరాగా ఉంటుంది.

– గొట్టుముక్కల ఏసు రత్నం, కౌలు రైతు, తూర్పు పాలెం, పోడూరు మండలం

గతం ప్రభుత్వంలో సాగుకు ముందే సాయం

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పెట్టుబడులు కోసం రైతులు ఇబ్బంది పడాల్సిన పనిలేకుండా సాగు ప్రారంభానికి ముందే వైఎస్సార్ రైతుభరోసా సాయం అందేది. కేంద్రం ఇచ్చే పీఎం కిసాన్ సాయం రూ.6 వేలకు, రాష్ట్ర ప్రభుత్వం రూ.7,500 జతచేసి ఏటా రూ.13,500 మొత్తాన్ని ఖరీఫ్ ఆరంభం, కోతలు, రబీ ఆరంభంలో మూడు విడతలుగా అందించేది. తొలివిడతగా రైతులకు రూ.7,500 చొప్పున మే నెలలోనే నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి రైతుల ఖాతాలకు జమచేసేవారు. తొలకరి పంట పెట్టుబడుల కోసం సన్న చిన్నకారు రైతులకు ఈసాయం ఎంతో ఉపయోగపడేది. గత ఐదేళ్లలో జిల్లాలోని 1,17,999 మంది రైతులకు రూ. 796.49 కోట్లు లబ్ధి చేకూర్చారు. ఏ సీజన్‌లో పంట నష్టం వాటిల్లితే అదే సీజన్‌లో ఇన్‌పుట్ సబ్సిడీని అందజేసేవారు. తద్వారా రైతుల నష్టం నుంచి తేరుకునేందుకు వీలుండేది. గత ఐదేళ్లలో 1,40,015 మంది రైతులకు రూ.103.47 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీని అందించారు.

న్యూస్‌రీల్

కృష్ణాష్టమి వేడుకల్లో మాజీ మంత్రి కొట్టు



వీకర్స్‌కాలనీలోని కృష్ణుడి గుడిలో పూజలు నిర్వహిస్తున్న కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: కృష్ణాష్టమి సందర్భంగా మాజీ ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ పట్టణంలోని వీకర్స్ కాలనీలోని కృష్ణుడి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గ ప్రజలకు కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. కృష్ణాష్టమి పర్వదినాన్న ఉట్టి కొట్టే కార్యక్రమం యువతకు ఎంతో ఉత్సాహకరమైన క్రీడ అన్నారు. ఈ కార్యక్రమంలో బొద్దాని శ్రీనివాస్, ముప్పిడి సంపత్‌కుమార్, పాలూరి శివ, తలగాని రామకృష్ణ, సారిపల్లి రమణ, అల్లూరి శ్యాం బాలాజి, ఉడిమూడి సుబ్బరాజు, అల్లుడి శ్రీను, గొద్దుబోయిన రామస్వామి, నమ్మి నాగేశ్వరరావు, రాజు పాల్గొన్నారు.

సీఆర్‌ఎంటీల జిల్లా కార్యవర్గం ఎన్నిక



భీమవరంలో ఎన్నికైన సీఆర్‌ఎంటీల జిల్లా నూతన కార్యవర్గం

భీమవరం: క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్ (సీఆర్‌ఎంటీ)ల జిల్లా నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. సోమవారం భీమవరంలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బొక్కా శ్రీనివాస్ (నరసాపురం), నరేష్‌కుమార్ (పెనుమంట్ర), కోశాధికారిగా వెంకన్నబాబు (కాళ్ల), ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎండీ బేగం (తణుకు), ఉపాధ్యక్షుడిగా నాగార్జున (భీమవరం), ఎ సుజాత (పెనుగొండ), న్యాయ సలహాదారుడిగా రాజ్‌కుమార్ (యలమంచిలి) ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ సీఆర్‌పీల హక్కులు సాధనకు కృషి చేస్తామని, రాష్ట్ర ప్రభుత్వం విద్యా శాఖలో విలీనం చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకుని ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

ప్రైవేట్ ఆసుపత్రుల తనిఖీ

సాక్షి స్పందన

తణుకు అర్బన్: 'మోగుతున్న డేంజర్ బెల్స్' శీర్షికన 'సాక్షి'లో సోమవారం ప్రచురితమైన కథనంపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు స్పందించారు. జిల్లా ఇన్‌చార్జి మలేరియా ఆఫీసర్ డాక్టర్ కేజేఎస్ రవికుమార్ తణుకులోని పలు ప్రైవేటు ఆస్పత్రులను సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఫీవర్ కేసులకు సంబంధించిన డేటాతోపాటు ల్యాబ్స్, ఇన్‌పేషెంట్ వార్డులను పరిశీలించారు. ఫీవర్ కేసుల్లో 7 రోజులకు పైబడి జ్వరంతోపాటు డెంగీ లక్షణాలు ఉంటే నిర్ధారణ కోసం రక్తనమూనాలను తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని ఎలిసా ల్యాబ్‌కు రోగి తాలూకా పూర్తి వివరాలతో పంపించాలని ఆస్పత్రి యాజమాన్యాలు, వైద్యులకు సూచించారు.

వైఎస్సార్ సీపీ నేత జోగాడకు అవార్డు



పురస్కారం అందుకుంటున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత, రాహుల్ సామాజిక సేవా సంస్థ వ్యవస్థాపకులు జోగాడ ఉమామహేశ్వరరావును మదర్ థెరిస్సా జాతీయ సేవా ప్రతిభా పురస్కారం లభించింది. సోమవారం ఊబలంక అయ్యప్పస్వామి దీక్షా మెయిన్ హాలులో మదర్ థెరిస్సా ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు దిడ్ల కిషోర్ ఆధ్వర్యంలో ఈ పురస్కారాన్ని ఉమామహేశ్వరరావు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి), మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, సీనియర్ నాయకులు గుణ్ణం నాగబాబు, జెడ్పీటీసీ నడపన గోవిందరాజుల నాయుడు, ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి అభినందించారు.

సీఐ ఆఫీస్‌లో 'చంటి' సీన్



వృద్ధుడితో మసాజ్ చేయించుకుంటున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం రూరల్ సీఐ కార్యాలయంలో ఒక ఏఎస్సై వృద్ధుడితో బాడీ మసాజ్ చేయించుకుంటున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో రావడంతో హాట్ టాపిక్‌గా మారింది. ఈ కార్యాలయంలో బులిస్వామి అనే వ్యక్తి ఏఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్నారు. చంటి సినిమాను తలపించేలా వృద్ధుడితో ఏఎస్సై ఒళ్లు మర్దనా చేయించుకుంటున్న వీడియో అందరినీ అవాక్కయ్యేలా చేస్తోంది.

తణుకు అన్న క్యాంటీన్‌లో దారుణం

- మురికి నీటిలో భోజనం ప్లేట్లు కడుగుతున్న సిబ్బంది
- సామాజిక మాధ్యమాల్లో వీడియో వైరల్..





వాష్ బేసిన్‌లో మురికి నీటితో ప్లేట్లు కడుగుతున్న సిబ్బంది, తణుకులోని అన్న క్యాంటీన్

తణుకు: తణుకులోని అన్న క్యాంటీన్‌లో బురద నీటిలో భోజనం ప్లేట్లు కడుగుతున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానిక సొసైటీ రోడ్డులోని అన్న క్యాంటీన్‌లో ఈ నెల 19న జరిగిన ఈ ఘటనకు సంబంధించి ఓ వ్యక్తి సెల్‌ఫోన్ ద్వారా వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయగా వైరల్ అయింది. అన్న క్యాంటీన్‌లో పేదలు ఉదయం టిఫిన్ తిన్న ప్లేట్లను వాష్ బేసిన్‌లో వేసి పూర్తి అపరిశుభ్రంగా ఉన్న నీటిలో కడుగుతున్న విషయం ఆ వీడియోలో స్పష్టంగా తెలుస్తోంది. తినేసిన ప్లేట్లను చేతులు కడుక్కునే వాష్ బేసిన్‌లో.. నిల్వ ఉన్న మురికి నీటిలో ఉంచి శుభ్రం చేస్తున్న విషయం ఆ వీడియోను చూస్తే అర్థమవుతోంది. హరేరామ్ హరేకృష్ణ అక్షయపాత్ర స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రతి రోజూ 350 మందికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం అందజేస్తున్నారు. ఈ వ్యవహారాన్ని మున్సిపల్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఈ క్రమంలో పేదలు తింటున్న అన్నం ప్లేట్లు ఎలా కడిగినా.. ఎవరు చూస్తారులే అనుకుంటూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై మున్సిపల్ కమిషనర్ బీవీ రమణను వివరణ కోరగా తినేసిన ప్లేట్లు సాధారణంగా వాష్ బేసిన్‌లో వేస్తుంటారని, అయితే ఆ రోజు ఒకేసారి తాకిడి రావడంతో మిగిలిన వ్యర్థాలు వాష్ బేసిన్‌లో ఉండిపోవడం వల్ల నీరు నిలిచిపోయిందని, అక్కడి నుంచి ప్లేట్లు తీసి వేరే చోట కడుగుతుంటారని చెప్పారు. అంతే తప్ప ఇందులో ఎలాంటి వాస్తవం లేదని ఆయన చెప్పుకొచ్చారు.

● ముకుందా.. ముకుందా



శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ఏలూరు గో సంరక్షణ కేంద్రంలో సోమవారం నిర్వహించిన పోటీల్లో శ్రీకృష్ణుడు, యశోదల వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఏలూరు

జ్వరంతో బాలిక మృతిపై మొక్కుబడిగా విచారణ

- జ్వరంతో బాలిక మృతి ఘటనపై డీఅండ్‌హెచ్‌ఓ, డీసీహెచ్‌ఎస్ విచారణ
- బాలిక తల్లిదండ్రులు, వైద్యురాలు లేకుండా తూతూమంత్రంగా సాగిన వైనం
- ఆస్పత్రి పరిశీలనకే పరిమితం.. మృతురాలి గ్రామం సందర్శించని అధికారులు



ఆకివీడు సీహెచ్‌సీలో రోగుల నుంచి వైద్య సేవలపై ఆరా తీస్తున్న అధికారులు

ఆకివీడు: ఆకివీడు సీహెచ్‌సీలో ఆదివారం ఓ బాలిక జ్వరానికి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనపై డీఎంఅండ్‌హెచ్‌ఓ మహేశ్వరరావు, డీసీహెచ్‌ఎస్ పి.సూర్యనారాయణ స్పందించారు. సోమవారం సీహెచ్‌సీలో విచారణ చేశారు. అయితే ఈ విచారణ మొక్కుబడిగా సాగిందనే విమర్శలు ఉన్నాయి. బాలిక తల్లిదండ్రులు, వైద్యురాలు అందుబాటులో లేకపోయినా విచారణ చేయడాన్ని తప్పుబడుతున్నారు. సీహెచ్‌సీలోని వార్డులు, రికార్డులను అధికారులు పరిశీలించి విచారణ ముగించారనే విమర్శిస్తున్నారు. విచారణ సందర్భంగా బాలికకు వైద్యం అందించిన తీరు, మందులు, ఇంజెక్షన్లు వాడిన తీరును పరిశీలించారు. ఏఎన్‌ఎం, నర్సులను ఆరా తీశారు. బాలికకు వైద్యం అందించిన వైద్యురాలు భువన సెలవులో ఉండటంతో ఆమెను ప్రశ్నించేందుకు అవకాశం లభించలేదు. విచారణ అనంతరం అధికారులు విలేకరులతో మాట్లాడుతూ జ్వరం వచ్చిన లహరి అనే విద్యార్థి ఆసుపత్రిలో చేరారని, వైద్యుల సకాలంలో వైద్యం అందించారని చెప్పారు. సాయంత్రం జ్వరం తగ్గిందని, రాత్రి సమయంలో మళ్లీ జ్వరం రావడంతో నైట్‌డ్యూటీలో ఉన్న వైద్యురాలు భువన బాలికకు పెరసెటమాల్ బిళ్ల ఇచ్చారన్నారు. టిఫిన్ తిన్న తరువాత వాంతులు, విరేచనం అయింద న్నారు. వెంటనే వైద్యురాలు బాలికకు ఇంజక్షన్లు ఇచ్చారని చెప్పారు. అయితే శ్వాసకోస సమస్య వల్ల వెంటిలేటర్ అవసరం ఏర్పడుతుందని ఏలూరు రిఫర్ చేయగా, మార్గమధ్యలో చనిపోయిందన్నారు. ఇన్‌పేషెంట్‌గా ఉన్న రోగికి పరీక్షలు చేయకుండా మందులు, ఇంజెక్షన్లు ఎలా వాడారని విలేకరులు ప్రశ్నించగా, పరీక్షలు నిర్వహించలేదని, ఆ విధంగా మందులు, ఇంజక్షన్ ఇవ్వడం సరి కాదని చెప్పారు. ఇన్‌పేషెంట్ విషయంలో వైద్యురాలి నిర్లక్ష్యం ఉందని ఒప్పుకున్నారు. విషయాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు కూడా తెలియజేయకపోవడం తప్పే నన్నారు. అవసరమైతే భీమవరంలోని ఆసుపత్రికి రిఫర్ చేసి ఉండాల్సిందని వారు వివరించారు. దుంపగడపలో ఈ నెలలో జ్వరపీడితులు 90 మంది ఉన్నారని, మండలంలో మొత్తం 186 మంది ఉన్నారన్నారు. గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. దీనిపై సమగ్ర నివేదికను జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తామని వివరించారు. విచారణలో ఆసుపత్రి సూపరింటెండెంట్ అజ్మీరా నజరిన్, లక్ష్మీనారాయణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి ఎస్‌ఏఎం పరీక్షలు

భీమవరం: జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో విద్యార్థులకు కామన్ ఎగ్జామినేషన్ బోర్డు ఆధ్వర్యంలో మంగళవారం నుంచి సెల్ఫ్ అసెస్మెంట్ మోడల్ (ఎస్ఏఎం) పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారిణి జి నాగమణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే పరీక్షల ప్రశ్నాపత్రాలను మండల కేంద్రాలకు పంపించామన్నారు. ప్రాథమిక స్థాయిలో 27న ఓఎస్ఎస్‌సీ(ఓరియంటల్ సంస్కృతం), 28న తెలుగు, 30న ఇంగ్లిష్, 31న గణితం, సెప్టెంబర్ 2న ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ పరీక్షలు జరుగుతాయన్నారు. ప్రాథమికోన్నత, ఉన్నత స్థాయి విద్యార్థులకు 27న ఓఎస్ఎస్‌సీ (ఓరియంటల్ సంస్కృతం), 28న తెలుగు, 30న హిందీ, 31న ఇంగ్లిష్, సెప్టెంబర్ 2న గణితం, 3న జనరల్ సైన్స్, 4న సాంఘిక శాస్త్రం పరీక్షలు నిర్వహిస్తామని, రోజుకో సబ్జెక్టుపై పరీక్ష చొప్పున ఆరు రోజుల పాటు పరీక్షలు జరుగుతాయని నాగమణి పేర్కొన్నారు

ఆలయ ప్రాంగణంలో అసాంఘిక కార్యకలాపాలు

ఆగిరిపల్లి : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన స్థానిక శ్రీశోభనాచలవ్యాఘ్ర లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ ప్రాంగణంలో ఆకతాయిలు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. బయటి ప్రాంతాల నుంచి వచ్చిన ఆకతాయిలు బైక్‌లపై విన్యాసాలు చేస్తూ, మద్యం, గంజాయి సేవిస్తూ, భక్తులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. దేవాలయ ప్రాంగణంలో ఖాళీ మద్యం సీసాలు, సిగరెట్లు, గుట్కా ప్యాకెట్లు కనిపించడంతో భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం సాయంత్రం కొందరు ఆకతాయిలు బైకులపై విన్యాసాలు చేస్తుండడంతో భక్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. ఆలయ ఈవో డి.సురేష్ బాబుని సంప్రదించగా పోలీస్ శాఖను గస్తీ ఏర్పాటు చేయాలని కోరినట్లు ఆయన తెలిపారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి

ఉంగుటూరు/తాడేపల్లిగూడెం : బాదంపూడి - చేబ్రోలు రైల్వే స్టేషన్ల మధ్య చేబ్రోలు యార్డు వద్ద రైలు ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి చెందినట్లు తాడేపల్లిగూడెం రైల్వే హెడ్‌కానిస్టేబుల్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. సుమారు 45-50 సంవత్సరాల మధ్య వయసు కలిగిన మహిళ లేత పసుపు రంగుపై తెలుపు పువ్వుల డిజైన్ టాప్, ఎరుపు రంగు ప్యాంటు, బ్లూ కలర్ చున్ని ధరించినట్లు చెప్పారు. మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ రూమ్‌లో భద్రపరిచామని, వివరాలు తెలిసిన వారు 80191 57528, 99480 10061 నంబర్లకు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.



క్షమించరాని నేరం



ప్రాణాలు కాపాడే డాక్టరుపైనే దారుణాలకు పాల్పడటం క్షమించరాని నేరం. కోల్‌కతాలో మహిళా డాక్టరుపై హత్యాచారం బాధాకరం. దోషులను కఠినంగా శిక్షించాలి. ఇలాంటి దారుణాలు మరెక్కడా జరగకుండా కఠిన చర్యలు చేపట్టాలి. ఎక్కడ లైంగిక వేధింపులకు పాల్పడినా తక్షణం శిక్షను అమలు చేసేలా కఠిన చట్టాలు చేయాలి. తప్పు చేయాలంటేనే భయపడే పరిస్థితులు ఉండాలి.

– డాక్టర్ చక్రధర్, పీహెచ్‌సీ వైద్యుడు, పెదపాడు

ప్రత్యేక రక్షణ కల్పించాలి



పాలకొల్లు అర్బన్: గ్రామీణ ప్రాంతాల్లో రాత్రి సమయాల్లో విధులు నిర్వహించే మహిళా వైద్యులకు ప్రత్యేక రక్షణ కల్పించాలి. ముఖ్యంగా ఆసుపత్రిలో నైట్ వాచ్‌మెన్‌ను సెక్యూరిటీగా పెట్టాలి. అలాగే మహిళా వైద్యులకు ప్రత్యేక గది ఏర్పాటు చేయాలి. ఏదైనా సమస్య తలెత్తినప్పుడు పోలీసులు తక్షణం స్పందించాలి. కలకత్తాలో వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్య ఘటనలు మరెన్నడూ జరగకుండా చర్యలు తీసుకోవాలి.


– డాక్టర్ ఎం.నవ్యజీవన్, మెడికల్ ఆఫీసర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, లంకలకోడేరు

బందరు రైల్వే లైన్ సర్వేకు గ్రీన్‌సిగ్నల్

- ఇటీవలి బడ్జెట్‌లో సర్వే పనులకు కేంద్రం ఆమోదం
- సముద్రతీరం వెంబడి 69 కిలోమీటర్ల మేర కొత్త రైల్వే లైన్
- కొనసాగుతున్న కోటిపల్లి-నరసాపురం రైల్వే లైన్ పనులు
- టెర్మినల్ స్టేషన్‌గా మారేందుకు నరసాపురానికి అవకాశం



నరసాపురం : ఎప్పుడో బ్రిటీష్ హయాంలో 1929లో ఏర్పడ్డ నరసాపురం రైల్వే వ్యవస్థలో అభివృద్ధి పరంగా కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఇదే బ్రిటీష్‌హయాం నుంచి పెండింగ్‌లో ఉన్న నరసాపురం-మచిలీపట్నం (బందరు) మధ్య కొత్త రైల్వే లైన్ నిర్మాణం చేపట్టాలని రైల్వేశాఖ నిర్ణయించింది. ఇటీవల ప్రవేశపెట్టిన 2024-25 రైల్వేబడ్జెట్‌లో నరసాపురం-మచిలీపట్నం మధ్య 69 కిలోమీటర్లు మేర కొత్త రైల్వే నిర్మాణం చేయడానికి సర్వే పనులకు ఆమోదం తెలిపింది. దీంతో రైల్వేశాఖ కొత్త రైల్వే లైన్ నిర్మాణానికి ఎంత వ్యయం అవుతుంది, ఎంతకాలం పడుతుంది, ఎంతమేర భూసేకరణ చేయాలనే అంశాలపై దృష్టి పెట్టింది. 1929లో నరసాపురం వరకు రైల్వేలైన్ నిర్మాణాన్ని పూర్తి చేసిన తరువాత బ్రిటీష్ ప్రభుత్వం అప్పటిలోనే నరసాపురం నుంచి మచిలీపట్నం వరకూ రైల్వేలైన్‌ను పొడిగించాలని భావించింది. ఇటు నరసాపురం, అటు మచిలీపట్నం రెండూ కూడా సముద్రతీర పట్టణాలు కావడం, జలరవాణా ప్రధానంగా ఉండే ఆ రోజుల్లో ఈ రెండు పట్టణాలు కూడా బ్రిటీష్ పాలనా వ్యవహారాల్లో కీలకంగా ఉండటంతో రెండిటికి అనుసంధానంగా రైల్వే రవాణా సదుపాయం ఉండాలని భావించింది. కానీ అది కార్యరూపం దాల్చలేదు. ఇన్నాళ్లకు మళ్లీ ఆ ప్రతిపాదన ముందుకు వచ్చింది. కొత్త రైల్వే నిర్మాణం అంశం పట్టాలెక్కితే సముద్రతీరం వెంబడి రైల్వేలైన్ ఏర్పాటు అవుతుంది.



నరసాపురం-మచిలీపట్నం మధ్య నిర్మించనున్న రైల్వే లైన్ మ్యాప్

టెర్మినల్ స్టేషన్‌గా నరసాపురం రూపాంతరం

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కోటిపల్లి-నరసాపురం రైల్వే నిర్మాణ పనులు ఓ పక్క వేగంగా జరుగుతున్నాయి. రూ.28 వేల కోట్ల అంచనాతో ప్రారంభమై కోటిపల్లి నరసాపురం రైల్వేలైన్ నిర్మాణానికి గత 6 ఏళ్ల నుంచి ప్రతి బడ్జెట్‌లో కేంద్రం నిధులు కేటాయిస్తుంది. 2024-25 సంవత్సరం రైల్వే బడ్జెట్‌లో కూడా రూ.300 కోట్లు కేటాయించింది. ఇప్పటికీ ఈ ప్రాజెక్ట్‌కోసం రూ.1450 కోట్లు కేటాయించింది. గోదావరిపై 3 చోట్ల రూ.700 కోట్లతో వంతెనల నిర్మాణాలు సాగుతున్నాయి. కోటిపల్లి టు నరసాపురం రైల్వేలైన్ నిర్మాణం పూర్తయితే అటు కోనసీమ నుంచి ఇటు కోస్తాకు రైల్వే ప్రయాణం అందుబాటులోకి వస్తుంది. ఇప్పుడు అన్నీ అనుకూలించి నరసాపురం-మచిలీపట్నం రైల్వే లైన్ నిర్మాణం కూడా సాగితే మొత్తం గోదావరి జిల్లాలకు అనుసంధానంగా అతిపెద్ద రైల్వే రవాణా వ్యవస్థ ఏర్పడుతుంది. దీంతో నరసాపురం అతిపెద్ద టెర్మినల్ స్టేషన్‌గా రూపాంతరం చెందుతుంది. ఇప్పటికే రైల్వేకోచ్‌లను కడగడం లాంటి మెయింటెనెన్స్ సెంటర్ విజయవాడ తరువాత నరసాపురంలోనే ఉంది. కోటిపల్లి, మచిలీపట్నం రైల్వే నిర్మాణాలు పూర్తయితే నరసాపురం విజయవాడ రైల్వే డివిజన్‌లోనే అతిపెద్ద జంక్షన్‌గా మారనుంది.

నరసాపురం రైల్వే రూపురేఖలు మారతాయి



నరసాపురం రైల్వే రూపురేఖలు పూర్తిగా మారనున్నాయి. కోటిపల్లి-నరసాపురం రైల్వేలైన్ నిర్మాణ పనులు సాగుతున్నాయి. నరసాపురం-మచిలీపట్నం రైల్వే లైన్ నిర్మాణ పనులు కూడా జరిగితే నరసాపురం అతిపెద్ద జంక్షన్‌గా మారుతుంది. ఇప్పటికే నరసాపురం స్టేషన్‌ను భారీ వ్యయంతో అభివృద్ధి చేస్తున్నారు. ఇక్కడ నుంచి మరిన్ని సర్వీస్‌లు పెరుగుతుతాయి.

–మధుబాబు, నరసాపురం స్టేషన్ మేనేజర్

ఏటీఎం చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్



నిందితులతో ఎస్సై వెంకటకుమార్, సిబ్బంది

ముదినేపల్లి రూరల్: ఏటీఎం చోరీ యత్నం కేసులో ఇద్దరు నిందితులను ఎస్సై డి వెంకటకుమార్ సోమవారం అరెస్టు చేశారు. వివరాల ప్రకారం మండవల్లి మండలం పుట్లచెరువుకు చెందిన బెండి రామకృష్ణ, బెండి లక్ష్మీనారాయణ అన్నదమ్ములు. వీరిలో రామకృష్ణ ఆన్‌లైన్ బెట్టింగులకు అలవాటు పడి అప్పుల పాలయ్యాడు. దీనితో ఏదోవిధంగా అప్పులు తీర్చాలనే ఉద్దేశంతో హైదరాబాదులో పేయింటర్‌గా పనిచేస్తున్న సోదరుడు లక్ష్మీనారాయణతో కలిసి ఈనెల 14న స్థానిక వై కూడలిలోని యాక్సిస్ బ్యాంకు ఏటీఎంను పగులగొట్టి చోరీకి యత్నించారు. అయితే అలారం మోగడంతో వారు పరారయ్యారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో కైకలూరు రూరల్ సీఐ బి కృష్ణకుమార్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో దొంగతనానికి పాల్పడిన ఇద్దరు నిందితులను సోమవారం అరెస్టు చేశారు. వారిని కైకలూరు కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు ఎస్సై వెంకటకుమార్ చెప్పారు.

ఇంక్యుబేషన్‌తో భలే ఉపాధి

- 2021లో ఉద్యాన వర్సిటీ ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటు
- సర్టిఫికెట్ కోర్సులు, సృజనకు పదునుపెట్టే శిక్షణలు
- గ్రామీణ యువత, మహిళల ఆర్థిక పరిపుష్టే లక్ష్యం

తాడేపల్లిగూడెం : సృజనకు పదును పెడితే మస్తిష్కం నుంచి ఆలోచనలు కోకొల్లలుగా బయటకు వస్తాయి. వచ్చిన ఆలోచనలకు శాస్త్రవేత్తల మార్గదర్శనం తోడైతే అద్భుతాలు ఆవిష్కృతమవుతాయి. కొత్త ఆదాయ మార్గాలు కనపడతాయి. ఎందరికో ఉపాధి మార్గాలను చూపించాలనే సంకల్పంతో మూడేళ్ల క్రితం డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో ఏర్పాటుచేసిన ఇంక్యుబేషన్ సెంటర్ ఇన్‌కమ్‌కి ఇన్నోవేషన్‌గా ఖ్యాతిగడిస్తోంది. గ్రామీణ యువత ఆర్థిక స్వయం సమృద్ధికి, మహిళల ఆర్థిక స్వావలంబనకు అవకాశం కల్పిస్తోంది. అంతేకాదు వివిధ కోర్సులు అభ్యసించి కొత్త గ్రాడ్యుయేట్లుగా మారడానికి ఇంక్యుబేషన్ కేంద్రం సాయం చేస్తోంది.

ఇలా ఆరంభం...

ఉద్యాన రంగంలో ఆదాయం పెంచడం, జీవనోపాధికి భద్రత కల్పించడం, ఎగుమతుల ద్వారా విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించే సామర్థ్యం కారణంగా ఉద్యాన రంగాన్ని అభివృద్ధి చెందిన రంగంగా గుర్తించడంతో రాష్ట్రీయ కృషి వికాస యోజన కింద 2021లో హార్టీ బిజినెస్ ఇంక్యుబేటర్ సెంటర్‌ను ఏర్పాటుచేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యాన రంగంలో వాణిజ్య పరిశ్రమలను స్థాపించడానికి వ్యవస్థాపకులను ఆకర్షిస్తున్న నేపథ్యంలో కొత్తతరం ఉద్యాన పట్టభద్రులు, రైతులు, గ్రామీణ నిరుద్యోగ యువత, మహిళలు పారిశ్రామికవేత్తలుగా మారడానికి, ఉద్యాన రంగాన్ని వాణిజ్యం వైపు నడిపించడానికి ఇంక్యుబేటర్ సెంటర్‌ను వెంకట్రామన్నగూడెంలో ఏర్పాటుచేశారు.



ఉద్యాన వర్సిటీ ఇంక్యుబేషన్ కేంద్రంలో శిక్షణ



నర్సరీ మేనేజ్‌మెంట్‌పై షేడ్‌నెట్‌లో శిక్షణ

లక్ష్యం ఇదే...

గ్రామీణ యువత, మహిళలతో ఉద్యాన రంగంలో పరిశ్రమలను ఏర్పాటుచేసేలా చేయడం. ఉన్న అవకాశాల గురించి శిక్షణలు ఇవ్వడం. ఉత్పత్తులను ఎలా తయారు చేయాలి, ఏ విధంగా మార్కెటింగ్ చేసుకోవాలి, అనే విషయాలపై అవగాహన, శిక్షణ కల్పించడం లక్ష్యంగా ఈ కేంద్రం ఏర్పాటుచేశారు. స్టార్టప్‌ల వృద్ధి, డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, డిజిటల్ లైబ్రరీ ద్వారా అవగాహన కల్పిస్తున్నారు.

శిక్షణలు

పండ్లు, కూరగాయలను తక్కువ ఖర్చుతో ప్రోసెసింగ్ చేయడం ద్వారా వ్యాపారాన్ని స్థాపించడం, వాణిజ్య నర్సరీల ఏర్పాటు, కూరగాయల పంటల రక్షితసాగు, బయోఫెర్టిలైజర్ యూనిట్ ఏర్పాటు, పూలలో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, కూరగాయల సేంద్రియ ఉత్పత్తి, పుట్టగొడుగుల పెంపకం తదితరాలపై శిక్షణలు ఇస్తున్నారు.

సర్టిఫికెట్ కోర్సులు

ఇప్పటివరకు పది శిక్షణ కార్యక్రమాలు, రెండు సర్టిఫికెట్ కోర్సులు నిర్వహించారు. సేంద్రియ సాగుపై 12 వారాలు,ఉద్యాన నర్సరీల నిర్వహణపై 16 వారాల సర్టిఫికెట్ కోర్సులను నిర్వహించారు.

పది లక్షల టర్నోవర్‌తో వ్యాపారం చేస్తున్నా



హార్టీ బిజినెస్ ఇంక్యుబేటరీ సెంటర్‌లో ఇంక్యుబేటీగా చేరాను. ఉద్యాన శాస్త్రంతో పాలిటెక్నిక్ పూర్తిచేసిన నేను తేనెటీగల పెంపకంలో ఇక్కడ శిక్షణ తీసుకొని కృష్ణాజిల్లా మైలవరం మండలం గణపవరంలో హార్టీటెక్ ప్రకృతి తేనే ఉత్పత్తుల వ్యాపారం ప్రారంభించాను. ఇంక్యుబేటరీ కేంద్రంలో శిక్షణ నాకు అక్కరకు వచ్చింది. పది లక్షల రూపాయల టర్నోవర్‌తో వ్యాపారం చేస్తున్నాను.

– ఉత్తేజ్‌కుమార్, శిక్షకుడు

నర్సరీ నిర్వహిస్తున్నాను



నర్సరీల యాజమాన్యంపై ఇంక్యుబేటరీ సెంటర్ నిర్వహించిన 16 వారాల సర్టిఫికెట్ కోర్సులో చేరాను. ఉద్యాన పంటలలో, నర్సరీలలో యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ, మార్కెటింగ్ మెలకువలు నేర్చుకున్నాను. తాడేపల్లిగూడెంలో మాధురి నర్సరీ నిర్వహిస్తున్నాను.

– జిల్లేపల్లి మాధురి, శిక్షకురాలు

ఉద్యోగ ప్రదాతలుగా మార్చడానికే



ఉద్యాన, వ్యవసాయ గ్రాడ్యుయేట్లు, రైతులు, గ్రామీణ యువత, మహిళలు ఉద్యోగార్థులుగా కాకుండా, వారిని ఉద్యోగ ప్రదాతలుగా మార్చడానికి ఈ ఇంక్యుబేటరీ సెంటర్ పనిచేస్తోంది. వర్ధమాన వ్యాపార ఔత్సాహికులకు సాంకేతిక శిక్షణ, ఆర్థిక మార్గదర్శకత్వం, మార్కెటింగ్ లింకేజీల ద్వారా అమ్మకాలను ఎలా పెంచుకోవాలో ఈ కేంద్రం ద్వారా తెలియచేస్తున్నాం.

– డాక్టర్ ఎం.మాధవి, అసోసియేట్ డీన్

వ్యాపారవేత్తలుగా మారే వరకు తోడుగా..



ఇంక్యుబేటరీ సెంటర్‌లో శిక్షణ పొందిన వారు వ్యాపారవేత్తలుగా మారే వరకు తోడుగా ఇంక్యుబేటరీ సెంటర్ ఉంటుంది. అన్ని రకాల అవగాహనలు, శిక్షణలు ఇస్తాం. సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ ఆర్‌వీ సుజాత, కేంద్ర నిర్వాహకులు

ఆర్థికంగా ఎదగడానికి తోడ్పాటు



మహిళలు, యువత సృజనాత్మకతతో, స్వశక్తితో, స్వయం ఉపాధి కల్పించుకొని ఆర్థికంగా సామాజికంగా ఎదగడానికి ఇంక్యుబేటరీ సెంటర్ అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తుంది.

– డాక్టర్ వి.సుధావాణి, ప్రొఫెసర్

గిరిజన మహిళల ధర్నా

దాడి చేసిన వారిని శిక్షించాలంటూ పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన



గిరిజన మహిళలపై దాడి చేసిన వారిని శిక్షించాలని డిమాండ్ చేస్తున్న గిరిజనులు

టి.నరసాపురం: గిరిజనులు, దళితులు సాగు చేస్తున్న పంటను ధ్వంసం చేసిన భూస్వాములను కఠినంగా శిక్షించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం టి.నరసాపురం పోలీస్ స్టేషన్ ముందు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి ఏఎస్సైకి ఫిర్యాదు చేశారు. సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ గత ఐదేళ్ల నుంచి సుమారు 50కి పైగా కుటుంబాల్లోని గిరిజనులు, దళితులు ఎర్రకాలువ రిజర్వాయర్ మిగులు భూములను సాగు చేసి వరి, మొక్కజొన్న పండిస్తున్నారని తెలిపారు. అయితే ఆ భూములపై స్థానిక భూస్వాములు కన్ను పడిందని, దీంతో ఆవులు, గేదెలతో పంట పొలాలను తొక్కించి ధ్వంసం చేశారని తెలిపారు. అంతేకాకుండా గిరిజన దళిత మహిళల పట్ల అసభ్యకరంగా మాట్లాడుతూ వారి ఆత్మగౌరవం దెబ్బతీసేలా బెదిరించడం దుర్మార్గమన్నారు. మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన భూస్వాములపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పంట నష్టపోయినందుకుగాను కుటుంబానికి రూ.లక్ష చొప్పున నష్టపరిహారం ఇప్పించాలన్నారు. ఈ సమస్యపై స్థానిక ఎమ్మెల్యే చిర్రి బాలరాజు జోక్యం చేసుకోవాలని కోరారు. చట్ట ప్రకారం నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకురాలు మడకం సుధారాణి, సీపీఎం నాయకులు అనమోలు మురళి, వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సభ్యురాలు కుంజా చెల్లమ్మ, రామలక్ష్మి, దుర్గమ్మ, బేబీ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ ముఠా అరెస్ట్

రూ.2.50 లక్షలు విలువ చేసే 400 కిలోల కాపర్ వైర్ స్వాధీనం



ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం వద్ద వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ ప్రతాప శివకిషోర్



పోలీసులు స్వాధీనం చేసుకున్న కాపర్ వైర్లు

ఏలూరు టౌన్: వ్యవసాయ క్షేత్రాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ చేస్తున్న ముఠాను పోలీసులు ప్రత్యేక నిఘా వేసి పట్టుకున్నారు. ఐదుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి భారీగా కాపర్ వైరును స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్ సోమవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. వ్యసనాలకు బానిసలైన జీలుగుమిల్లి ప్రాంతానికి చెందిన గోపు కిరణ్, పానుకుమాటి నరసింహారావు, షేక్ హుస్సేన్ వ్యవసాయ క్షేత్రాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలకు పాల్పడుతుంటారు. గోపు కిరణ్‌పై విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ కేసులు 19 నమోదు కాగా తెలంగాణలో పీడీ యాక్ట్ సైతం నమోదైంది. 10 నెలలు చర్లపల్లి జైలులోనూ శిక్ష అనుభవించాడు. అలాగే పానుకుమాటి నరసింహారావుపై జీలుగుమిల్లి, గోపాలపురం, నల్లజర్లలో మూడు కేసులు ఉన్నాయి. ఇక ఈ ముగ్గురు చోరీ చేసిన కాపర్‌వైర్‌ను కొనుగోలు చేస్తున్న తెలంగాణ రాష్ట్రం అశ్వారావుపేటకు చెందిన తోట శ్రీనివాసరావును, విజయవాడకు చెందిన పదాతి సతీష్‌కుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఇద్దరి వద్ద 40 చోరీ కేసుల్లో అపహరించిన కాపర్‌వైరును విక్రయించినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. వీరి వద్ద నుంచి రూ.2.50 లక్షలు విలువ చేసే సుమారు 400 కిలోల కాపర్‌వైరును స్వాధీనం చేసుకున్నారు.

దొంగలు ఎక్కడ దొరికారంటే..

బుట్టాయగూడెం పోలీస్‌స్టేషన్ పరిధిలో 2024 ఫిబ్రవరి 5న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చోరీలపై కేసు నమోదైంది. జీలుగుమిల్లి సీఐ బీ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బుట్టాయిగూడెం ఎస్సై దుర్గా మహేశ్వరరావు తమ సిబ్బందితో ఈ కేసుపై దర్యాప్తు ప్రారంభించారు. ఎట్టకేలకు బుట్టాయిగూడెం మండలం మర్లగూడెం గ్రామ శివారులో ముగ్గురు వ్యక్తులు మోటారు సైకిల్‌పై అనుమానాస్పదంగా తిరుగుతూ ఉండగా పోలీసులు తనిఖీ చేశారు. వీరివద్ద ఒక ప్లాస్టిక్ సంచిలో 10 కిలోల కాపర్‌వైర్, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పగలకొట్టేందుకు ఉపయోగించే పనిముట్లు కలిగి ఉండడంతో వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ప్రతాప శివకిషోర్ మాట్లాడుతూ వ్యవసాయ క్షేత్రాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను చోరీ చేస్తూ వాటిలోని కాపర్‌వైరును తొలగించి, విక్రయిస్తున్నారు. ఇలాంటి చర్యలతో ప్రభుత్వానికి తీవ్ర నష్టం వాటిల్లుతోందని చెప్పారు. వ్యవసాయం చేసే రైతులకు రెండు, మూడు నెలలు విద్యుత్ సరఫరా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పంటలు నష్టపోతున్నారని చెప్పారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను చోరీ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. ఈ కేసులను చేధించిన పోలీసు అధికారులను ఆయన అభినందించారు.

క్లుప్తంగా

భూ బాధితుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి



పోస్టర్ విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): విజయవాడలో సీపీఐ ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీన జరిగే భూ బాధితుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సీపీఐ నాయకులు కోరారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నాయకులు, కార్మికులు పోస్టర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు మండల నాగేశ్వరరావు, వడ్డది మేరీ, చింతాడు బాలు, నిమ్మకాయల కుమార్, బోగిల్లి రాంబాబు, మెరిపో జాన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

నన్నయ్యలో సమానహక్కుల దినోత్సవం



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని ఆదికవి నన్నయ్య యూనివర్శిటీలో ఫార్మసీ విభాగం ఆధ్వర్యంలో సోమవారం మహిళా సమానహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మహిళల హక్కులు, చట్టాలపై వివరించారు. ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కోర్స్ కోఆర్డినేటర్ ఎస్.లిఖిత, ప్రిన్సిపాల్ టి.అశోక్, అధ్యాపకులు హీరా, సురేంద్ర, నిత్యానంద్, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యుత్ మోటార్లకు స్మార్ట్ మీటర్లు వద్దు



భీమవరంలో రైతు సంఘ సమావేశంలో మాట్లాడుతున్న జమలయ్య

భీమవరం: వ్యవసాయ విద్యుత్ మోటర్స్‌కు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని, 2022 విద్యుత్ బిల్లును కేంద్రం రద్దు చేయాలని ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి జమలయ్య డిమాండ్ చేశారు. సోమవారం భీమవరంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లుల శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా రైతులకు తక్షణమే ఎకరాకు రూ. 20 వేలు పెట్టుబడి సాయమందించాలని డిమాండ్ చేశారు. రైతులకు రూ. 2లక్షల లోపు ఉన్న రుణాలను మాఫీ చేయాలని కోరారు. ముందుగా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వైవీ ఆనంద్ కార్యకలాపాల నివేదికను సమర్పించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు గిడుగు రామమూర్తి



గిడుగు రామమూర్తి జయంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): గిడుగు రామమూర్తి తెలుగు భాషకు చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు అన్నారు. శ్రీవిజ్ఞాన వేదిక, తెలుగు భాషాభివృద్ధి సంఘం సంయుక్త ఆధ్వర్యంలో భీమేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం, భాషోద్యమ నాయకులు గిడుగు రామమూర్తి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలుగు మహాకవుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్య వైశ్యల యువజన సంఘ నాయకులు వబిలిశెట్టి రామకృష్ణ, నాటక ప్రయోక్త, కళారంజని నాటక అకాడమి అధ్యక్షుడు జవ్వాది శ్రీనివాస్, తెలుగు పండితులు కలిగొట్ల గోపాల శర్మ తెలుగు భాష ఔన్నత్యాన్ని వివరించారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఈ ఉత్సవాలు నాలుగు రోజులపాటు విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీలను నిర్వహించి విజేతలకు 29న బహుమతులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం, ఉండపల్లి రమేష్ నాయుడు, రాధాకృష్ణ, పూర్ణచంద్రరావు, కొత్త శ్రీనివాస్ పాల్గొన్నారు.

చట్టాలను కఠినతరం చేయాలి



ఆస్పత్రుల్లో పనిచేస్తున్న వైద్య సిబ్బంది రక్షణకు కఠినతరమైన చట్టాలు ఉండాలి. కోల్‌కతాలో వైద్య విద్యార్థినీపై జరిగిన అమానుష అత్యాచారం, హత్య ఘటన విషాదకరం. ఎక్కడైనా దాడులు, ఇతర సంఘటనలు జరిగితే అటువంటి వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలి. కోల్‌కతాలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిందితులను కఠినంగా శిక్షించాలి

కొల్లి రమావతి, శ్రీశ్రీ కళావేదిక జాతీయ కన్వీనర్, తాడేపల్లిగూడెం.

ప్రత్యేక చట్టం తేవాలి



కోల్‌కతా ఘటన తీవ్రంగా కలచివేసింది. వైద్యులు, మహిళలపై దాడులు జరగడం విచారకరం. మహిళలకు పూర్తి భద్రత కల్పించాలి. ముఖ్యంగా వైద్యులు, మహిళలపై అనుచితంగా ప్రవర్తించే వారిపై ప్రభుత్వాలు కఠినంగా శిక్షించాలి. అరబ్ దేశాల్లో మాదిరిగా కఠినంగా శిక్షలు అమలు చేయాలి. ఇలాంటి సంఘటనలు మళ్లీ జరగకుండా ప్రత్యేక చట్టాలను తేవాలి

– కలిదిండి పద్మావతి, న్యాయవాది, తణుకు



తణుకు అర్బన్: టీటీడీ కల్యాణ మండపం ముందు రోడ్డుపై ఉన్న చెత్త



తణుకు టౌన్: దువ్వలో రోడ్డు ప్రక్కనే చెత్త



తాడేపల్లిగూడెం: మసీదురోడ్డులోని ఒక డ్రెయినేజీ పరిస్థితి ఇలా.

అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం

- ఏ రోడ్డుకెళ్లినా చెత్త పోగులే
- వ్యర్థాలతో నిండిన డ్రెయినేజీలు
- 3నెలల్లో కనిపించని పరిశుభ్రత

తణుకు అర్బన్, తణుకు టౌన్, తాడేపల్లిగూడెం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. ఎక్కడ గొంగలి అక్కడే అన్నట్లు మండలంలో ఏ గ్రామంలో చూసిన పారిశుద్ధ్య లోపం కొట్టొచ్చినట్లు కనబడుతుంది. కొన్ని గ్రామాల్లో వ్యర్థాలు, చెత్త కుప్పలు ఎక్కువగా పేరుకుపోవడంతో దోమలు పెరిగి సీజనల్ వ్యాధులు వేగంగా ప్రబలుతున్నా అధికార యంత్రాంగం మాత్రం అటువైపు కన్నెత్తైన చూడడం లేదన్న విమర్శలు ఉన్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి గ్రామంలో స్వచ్ఛభారత్‌లో భాగంగా పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచి ప్రత్యేక చర్యలు చేపట్టేవారు. గ్రామ సర్పంచ్‌లు, కార్యదర్శులు గ్రామ వార్డు సచివాలయం సిబ్బందితో కలిసి గ్రామాల్లో పర్యటించి ఎక్కడా పారిశుద్ధ్యం లోపించకుండా ప్రజలకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకునేవారు. ఒక వైపు వ్యాధుల కాలం ప్రజలు సీజనల్ వ్యాధులు జ్వరాలు, డయేరియా, మలేరియా వంటి రోగాల బారిన పడి ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. విష జ్వరాలు ప్రబలడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్వచ్ఛభారత్ అన్నారు.. మోడల్ తణుకన్నారు కానీ ఏరోడ్డులో చూసినా చెత్త మాత్రం దర్శనమిస్తోంది. ఒకవైపు రకరకాల జ్వరాలు, డయేరియా వంటి వ్యాధులు విజృంభిస్తున్న వేళ ఇటు పాలకులు, అధికారులు కూడా పారిశుద్ధ్యంపై ఎటువంటి శ్రద్ధ చూపించడం లేదని ప్రజానీకం దెమ్మెత్తిపోస్తున్నారు. చెత్తాచెదారాలు రోడ్డుపైనే ఉండడంతో ఆ దుర్గంధంతో ప్రయాణికులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం రహదారుల్లో ప్రయాణం చేయాలంటే ముక్కుమూసుకుని వెళ్లాలని ఆరోపిస్తున్నారు. ఇక మురుగునీరు ప్రవహించే డ్రెయినేజీలైతే వ్యర్థాలతో నిండిపోయి మురుగునీరు ప్రవాహానికి ఆటంకంగా మారింది. కొన్ని ప్రాంతాల్లో డ్రెయినేజీలు ఉన్నాయా అని వెతుక్కునే విధంగా పిచ్చిమొక్కలతో నిండిపోయి ఉన్నాయి. ముఖ్యంగా బ్యాంక్ కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ, బొమ్మల వీధి, టీటీడీ కల్యాణ మండపం, టౌన్ హాలు వెనుక ప్రాంతాలతోపాటు ఎన్జీవోస్ కాలనీ, ఇరగవరం కాలనీల్లో చెత్త సమస్యతోపాటు డ్రెయినేజీల దుర్గంధ సమస్య కూడా అధికంగా ఉందని స్థానికులు చెబుతున్నారు. దువ్వ గ్రామంలో రోడ్డుపైన చెత్త వేసి పారిశుద్ధ్యం నెలకొంది. పారిశుద్ధ్య నిర్వహణ ఇలా ఉంటే ఎవరికి ఏ రోగం వస్తుందోనంటూ ప్రజలు భయాందోళనలో గడుపుతున్నారు.



తణుకు ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ వద్ద రోడ్డును ఆక్రమించిన చెత్త

గతం ఘనం..

గత ప్రభుత్వ హయాంలో స్వచ్ఛభారత్‌కు అత్యంత ప్రాధాన్యతనిస్తూ ఏరోజు చెత్త ఆరోజే కంపోస్టు యార్డుకు తరలించే విధంగా చర్యలు తీసుకున్నారు. పారిశుద్ధ్య నిర్వహణపై కిందిస్థాయి సిబ్బందిపై అధికారులు, ఆ అధికారులపై ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు నిరంతర పర్యవేక్షణ ఉండడంతో పక్కా ప్రణాళికతో పారిశుద్ధ్య ర్వహణ సక్రమంగా జరిగేది కానీ నేడు పారిశుద్ధ్య నిర్వహణను పట్టించుకునే నాధుడే లేకపోవడంతో ఎక్కడి చెత్త అక్కడే ఉండి రోగాలకు ఆవాసంగా మారింది. డ్రెయినేజీలు సైతం వ్యర్థాలతో నిండిపోయి మురుగునీరు ప్రవాహానికి ఆటంకం కలిగించే విధంగా ఉంది. కూటమి ప్రభుత్వం ఏర్పడి 3నెలల్లోనే పారిశుద్ధ్య నిర్వహణ ఇంతకు దిగజారిపోవడంపై ప్రజలు గుర్రుగా ఉన్నారు. అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుద్ధ్యంపై చర్యలు తీసుకొంటారని కోరుతున్నారు.



తణుకు అర్బన్: బ్యాంక్ కాలనీలో డ్రెయినేజీలో పేరుకుపోయిన చెత్త

తాడేపల్లిగూడెం: పట్టణంలో పారిశుద్ధ్య పరిస్థితులు దిగజారుతున్నాయి. కొన్ని ప్రాంతాలలో డ్రెయిన్లు చెత్తా చెదారాలలో నిండిపోయాయి. రోజువారీ వీటిని శుభ్రం చేయించకపోవడం వల్ల దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. ఓ పక్క ఎటూ కాని వాతావరణం, ఎండా, వాన కింద ఉండటంతో పాటు పారిశుద్ధ్య పరిస్థితులు బాగోక దోమల విజృంభణ పెరిగింది. వైరల్ జ్వరాలు, టైఫాయిడ్‌తో పాటు ప్రమాదకరమైన డెంగీ జ్వరాలు వస్తున్నాయి. పట్టణానికి చెందిన ముగ్గురికి డెంగీ రావడంతో ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇంటింటా చెత్త సేకరణ ఉన్నా కూడా రోడ్లపై కొందరు చెత్తను వేయడంతో, డంపర్ బిన్‌లు అపారిశుద్ధ్యానికి చిరునామాగా మారడం, వంటి కారణాలతో పారిశుద్ధ్యం దిగజారుతోంది.

పారిశుద్ధ్యంపై పర్యవేక్షణేది..



తణుకు మునిసిపాలిటీలో పారిశుద్ధ్య నిర్వహణ గాడి తప్పింది. గతంలో క్షేత్రస్థాయిలో అధికారులు, ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ ఉండడంతో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా జరిగేది. కానీ నేడు ఏ వీధిలో చూసిన చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయి. ఇక డ్రెయినేజీల్లో మురుగునీరు ప్రవహించే పరిస్థితి కనిపించడంలేదు. అధికారులు పర్యవేక్షించి పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలి.

– షేక్ జిలాని, తణుకు

వ్యాధులు రాకుండా ప్రత్యేక శ్రద్ధ చూపాలి



ఖాళీ స్థలాలో వ్యర్థాలు, డ్రెయిన్‌లలో వ్యర్థాలు నెలకొని ఉన్నాయి. ఎక్కడ చూసిన దుర్గంధం వెదజల్లడంతో పాటు అనారోగ్య పరిస్థితులు తాండవిస్తున్నాయి. జ్వరాలు, దగ్గు, రొంప, వైరల్ ఫీవర్‌లు వస్తున్నాయి. వ్యాధులు తగ్గక పోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పురపాలక సంఘం, హెల్త్ అధికారులు ప్రజలకు వ్యాధులు రాకుండా ప్రత్యేక శ్రద్ధ చూపాలని పరిసరాల పరిశుభ్రంగా ఉంచే విధంగా చూడాలని కోరుతున్నాం.

–మహ్మద్ ప్రక్రుద్దీన్ అలీ అహ్మద్

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం



స్టాఫ్ నర్స్‌లకు సత్కరిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. సోమవారం ఏరియా ఆస్పత్రిలో మదర్‌థెరిస్సా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముగ్గురు స్టాఫ్ నర్స్‌లకు ఉత్తమ సేవా పురస్కారాలు అందజేశారు. ఆసుపత్రిలో ఉన్న రోగులకు బిస్కెట్లు, రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. తిమ్మరాజుపాలెం వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ పి.సూర్యనారాయణ, క్లబ్ సభ్యులు సుంకర శ్రీనివాస్, చిన్నం జగదీష్, ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు, గ్రంధి సత్యనారాయణ, వంగపండు రామ్మోహన్‌రావు, సన్నిధి సూర్యనారాయణ మూర్తి, నిట్టా సుబ్బారావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

సాక్షి స్పందన

తణుకు అర్బన్: మోగుతున్న డేంజర్ బెల్స్ శీర్షికన సాక్షిలో సోమవారం ప్రచురితమైన కథనానికి జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు స్పందించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో ఇప్పటి వరకు మూడు డెంగీ కేసులు మాత్రమే నమోదయ్యాయని, వారు కూడా ఆరోగ్యంగానే ఉన్నారని తెలిపారు. ఇప్పటివరకు మలేరియా కేసులు లేవని, జ్వరాలన్నీ డెంగీ జ్వరాలు కావని జ్వరపీడితుల్లో లక్షణాలు చూసి తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి, తాడేపల్లిగూడెం ఏరియా ఆస్పత్రుల్లో మెక్ ఎలీసా టెస్ట్‌ల ద్వారానే డెంగీగా నిర్ధారణ చేయాల్సి ఉంటుందన్నారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో నమోదైన జ్వరాలకు సంబంధించిన వివరాలు ఎప్పటికప్పుడు జిల్లా మలేరియా అధికారికి తెలపాల్సిందిగా యాజమాన్యాలకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమాలను నిర్వహిస్తూ స్థానిక పంచాయితీ సిబ్బంది, సబ్ యూనిట్ బృందాల సహకారంతో జిల్లా మలేరియా అధికారి పర్యవేక్షణలో దోమలు, వాటి లార్వాల నిర్మూలనకు కృషిచేస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



అత్తిలి: విశేష అలంకరణలో వేణుగోపాలస్వామి



తాడేపల్లిగూడెం(టీఓసీ): కోలాటం ఆడుతున్న చిన్నారులు



పెంటపాడు: కె. పెంటపాడులో వేణుగోపాల స్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం



తాడేపల్లిగూడెం రూరల్: కొమ్ముగూడెంలో గ్రామోత్సవం

అత్తిలి: మండలంలో కృష్ణాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణ ఆలయం 28వ వార్షికోత్సవాలు సందర్భంగా కాగిత సోమ సుందర గోపాలస్వామి, లలిత దుర్గ దంపతులచే పూజా కార్యక్రమాలు జరిపారు. శ్రీకృష్ణాష్టమి వేడుకలు సెప్టెంబర్ 1వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు అత్తిలి పట్టణ యాదవ సంఘ సభ్యులు తెలిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై కృష్ణుడికి పూజలు చేశారు.

పెంటపాడు: కృష్ణాష్టమి వేడుకలు మండలంలో పలు గ్రామాల్లో సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కృష్ణాష్టమి పురస్కరించుకొని బైరాగిమఠంలోని గోపాలస్వామి ఆలయంలో స్వామివారికి విశేష పూజలు చేశారు. ని, ఆలయాన్ని పూలతో అలంకరించారు. ఈవో రవిశంకర్ ఆధ్వర్యంలో ఈ సందర్భంగా పలు పూజలు నిర్వహించారు. ట్రిపుల్ కర్మాగారంలో యాజమాన్యం ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో కార్మికులు ఉట్టి కొట్టారు.

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ప్రతి గ్రామంలో శ్రీకృష్ణాష్టమి ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రధానంగా వెంకట్రామన్నగూడెం, చినతాడేపల్లి, కడియద్ద, కృష్ణాపురం, నీలాద్రిపురం, కొమ్ముగూడెం, అప్పారావుపేట, దండగర్ర, జగన్నాథపురం, మాధవరం, కృష్ణాయపాలెం, పుల్లాయగూడెం, ఎల్.అగ్రహారం, కుంచనపల్లి, కొండ్రుప్రోలు తదితర గ్రామాల్లోని కృష్ణ మందిరాల్లో ఉదయం నుంచి పూజలు జరిపారు. శ్రీకృష్ణుడిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఉంచి చిత్ర విచిత్ర వేషాల నడుమ గ్రామోత్సవం అత్యంత వైభవంగా జరిగాయి. యువతీ, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం (టీఓసీ): శ్రీకృష్ణాష్టమి ఉత్సవాలు పట్టణంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణయోగ ధ్యాన మందిరంలో పంచామృతాలతో, వివిధ ఫలరసాలతో సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. స్వామివారికి నూతన వస్త్రాలు అందజేశారు. ఉట్టి మహోత్సవం నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని వెంకట్రామన్నగూడెం గ్రామంలో ఆర్ అండ్ బీ రోడ్డు పనుల నిమిత్తం మంగళవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్. వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

మదర్‌థెరిస్సాను యువత స్ఫూర్తిగా తీసుకోవాలి



తణుకు అర్బన్: మదర్ థెరిస్సా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: ప్రేమ, దయ, వాత్సల్యానికి మారుపేరుగా నిలిచిన మానవతామూర్తి మదర్‌థెరిస్సాను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని స్ఫూర్తి స్వచ్ఛంద సేవాసంస్థ గౌరవ అధ్యక్షుడు పైబోయిన ఏసుబాబు అన్నారు. మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా తణుకు శివాలయం వీధిలో ఉన్న ఆమె విగ్రహానికి సంస్థ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగపీడితులు, అనాథలను అక్కున చేర్చుకుని వారికి అందించిన సేవలు అజరామజరమని అన్నారు. ఈ సందర్భంగా మిఠాయిలు పంచి ఆమె సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు దేవరపల్లి రత్నరాజు, ఆటో యూనియన్ అధ్యక్షుడు కండెల్లి వరప్రసాద్, ఆకుల సూరిబాబు, సంస్థ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

మదర్ థెరిస్సా సేవలు స్ఫూర్తిదాయకం

తణుకు టౌన్: అభాగ్యులకు, రోగులకు మదర్ థెరిస్సా అందించిన సేవలు ప్రపంచ మానవాళికి స్ఫూర్తిదాయకమని వైద్యులు డాక్టర్ కమ్మ రామలక్ష్మీ చెప్పారు. సోమవారం మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉత్తమ వైద్య సేవలు అందజేసిన నర్సులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ డాక్టర్ దాట్ల సుందరరామరాజు రూ. 10 వేలు విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో కరుణాకర్ చౌదరి, ఉపాధ్యక్షుడు నల్లజర్ల వెంకటేశ్వరరావు, కార్యదర్శి ఎండీ స్వాహాలిక, కోశాధికారి ఆర్జి భాస్కరరావు, సభ్యులు వెంకటరెడ్డి, సుబ్రహ్మణ్యం, నాగేశ్వరరావు, తాజుద్దీన్, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో.....



తణుకు టౌన్: మదర్ థెరిస్సా జయంతి కార్యక్రమంలో నర్సులను సత్కరిస్తున్న దృశ్యం



తణుకు టౌన్: మదర్ థెరిస్సా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న లయన్స్ సభ్యులు

మదర్ థెరిస్సా జయంతి వేడుకలను తణుకు లయన్స్ క్లబ్ ఆవరణలో క్లబ్ అధ్యక్షుడు సప్పా బలరామకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ డి. రంగారావు, అధ్యక్షుడు బలరామకృష్ణ తదితరులు మదర్ థెరిస్సా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి ఎం రవి రిజనాల్డ్, కోశాధికారి చీకటి శ్రీనివాసరావు, సభ్యులు నల్లజర్ల వెంకటేశ్వరరావు, ఆకుల వెంకటేశ్వరరావు, ఎంఆర్ కోటేశ్వరరావు, పీవీ రమణ, చిన వెంకటరాజు, తదితరులు పాల్గొన్నారు. మదర్ థెరిస్సా జయంతి వేడుకలు తణుకు స్వర్ణ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తణుకు స్వర్ణ క్లబ్ అధ్యక్షుడు బంటుమిల్లి శేషారావు, క్లబ్ సభ్యులు వావిలాల వెంకట రమేష్, బూరుగుపల్లి వెంకట్రావు, తులసి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆటో యూనియన్ వార్షికోత్సవం



తణుకులో 25వ వార్షికోత్సవ కరపత్రాలను ఆవిష్కరించిన యూనియన్ నాయకులు

తణుకు అర్బన్: శ్రీ భారతమాత ఆటో ఓనర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఏర్పడి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వచ్చేనెల 1వ తేదీన తణుకు కాపు కల్యాణ మండపంలో సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు పంగం రాంబాబు, కంచుమర్తి విశ్వేశ్వరరావు తెలిపారు. తణుకు యూనియన్ కార్యాలయం వద్ద నిర్వహించిన సమావేశంలో సిల్వర్ జూబ్లీకి సంబంధించిన కరపత్రాలను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూనియన్ ఏర్పాటుచేసిన నాటి నుంచి సభ్యులకు అండగా నిలబడడమే కాకుండా ప్రజలకు ఉపయోగపడే విధంగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించి తమ యూనియన్ స్ఫూర్తిదాయకంగా నిలిచిందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కౌరు వెంకటేశ్వర్లు, మోదే విష్ణు, పిండి నాగేశ్వరరావు, ఎ.బ్రహ్మాజీ, సభ్యులు పాల్గొన్నారు.

ఫెన్సింగ్ పనుల అడ్డగింపు

భీమవరం అర్బన్: భీమవరం మండలంలో గూట్లపాడులో కొప్పర్తి సుబ్రహ్మణ్యేశ్వరరావుకు శ్రీ రాజ రాజేశ్వరి అమ్మవారి దేవాలయానికి సంబంధించి సరిహద్దులో ఫెన్సింగ్ పనులను సోమవారం పంచాయతీ కార్యదర్శి జేవీ సత్యనారాయణ, వీఆర్వో ఆర్ రత్నంరాజు అడ్డుకుని నిలిపివేశారు. శ్రీ రాజ రాజేశ్వరి అమ్మవారి ఆలయ గోపుర నిర్మాణ పనులు వివాదంలో ఉండటంతో ఈ పనులను నిలిపివేశారు. పంచాయతీ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మాట్లాడుతూ శ్రీ రాజ రాజేశ్వరి ఆలయ గోపుర నిర్మాణం వివాదంలో ఉందని దాని సరిహద్దులో ఉన్న కొప్పర్తి సుబ్రహ్మణ్యేశ్వరరావు స్థల విషయమై సర్వే చేయించుకున్న అనంతరం ఫెన్సింగ్ నిర్మించుకోవాలన్నారు.